




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/


మంగళవారం 29-7-2025

సంపుటి: 21 సంచిక: 108

పేజీలు: 8 వెల: రూ.1


- వర్సిటీ అధికారుల రికార్డుల్లో మాత్రం నిక్షేపంగా ఉందట
- వాటినే నమ్మి ఏటా పర్మిషన్లు ఇచ్చేస్తున్న ఎన్‌సీటీఈ
- ఏటా 110 అడ్మిషన్లతో రూ.లక్షల ఫీజులు
- భవనాల్లేకుండా, క్లాసులు చెప్పకుండానే సర్టిఫికెట్లు
- సర్వం మాయ అన్నట్లు సాగుతున్న శివసాయి బీఈడీ కళాశాల


## అంతరాబలో ఆ కాలేజీ ఎక్కడుందబ్బా!


బీఈడీ కాలేజీ కింద చూపించిన కిరణ్మయి విద్యాసంస్థల బిల్డింగ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

'మీ కాలేజీ భవనాలు మీరు రిజిస్టర్ చేసుకున్న సొసైటీ పేరుతోనే ఉన్నాయా?.. ఉంటే ఆ కాగితాలు తీసుకురండి.. వందమంది విద్యార్థులు ఉన్న కాలేజీలో ఆ బెంచీల సంఖ్య ఏంటి?.. బాత్రూమ్‌లు ఉండాల్సింది ఇలాగేనా?.. బ్లాక్‌బోర్డు మీద ఉండాల్సిన నల్లరంగు అక్కడక్కడ వెలిసిపోయిందెందుకు?.. మీ రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టీలు పట్టుకురండి.. పాఠాలు చెప్పే అధ్యాపకుల సర్టిఫికెట్లేవీ?.. ఇలా అయితే కుదరదు. మళ్లీ మేం కబురు పంపుతాం.. కాస్త పెద్ద జేబుతో రండి.'

.. ఇదీ జిల్లాలో ఉన్న 13 బీఈడీ కాలేజీల అనుమతులను ప్రతి ఏటా రెన్యూవల్ చేసే విషయంలో సంబంధిత యూనివర్సిటీ అధికారులు అనుసరిస్తున్న తంతు. కానీ ఈ పదమూడే కాకుండా.. జిల్లాలో 14వ బీఈడీ కాలేజీ ఉంది. దాని పేరు శ్రీ శివ సాయి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్. పాత పట్నం మండలం అంతరాబ గ్రామం, ప్లాట్ నెంబరు 3/2 అనే చిరునామాలో సదరు కళాశాల ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అసలు పాత పట్నం నుంచి పర్లాకిమిడి ఒడిశా బోర్డరుకు వెళ్లే దారిలోని మారుమూల గ్రామంలో ఒక ప్లాట్‌లో కళాశాల ఉందంటేనే వర్సిటీ అధికారులకు డౌట్ రావాలి. కానీ 2016-17 నుంచి ఇప్పటి వరకు మన ఘనత వహించిన వర్సిటీ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు ఆ కళాశాలపై ఏమాత్రం అనుమానం రాలేదంటే నమ్మశక్యం కాదు. ఎందుకంటే.. సదరు వర్సిటీలో ఎన్ని జంతర్‌మంతర్‌లు జరిగాయో అందరికీ తెలుసు. అలాంటిది అంతరాబ గ్రామంలో బీఈడీ కాలేజీ ఉందని, అది బ్రహ్మాండంగా నడుస్తుందని, అన్ని వసతులు ఉన్నాయని ప్రతిసారీ సర్టిఫికెట్ ఇస్తున్నారంటే.. దాని వెనుక ఏం జరిగి ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.


राष्ट्रीय अध्यापक शिक्षा परिषद (भारत सरकार का एक विधिक संस्थान) दक्षिण क्षेत्रीय समिति

NCTE

National Council for Teacher Education (A Statutory Body of the Government of India) Southern Regional Committee

F.SRO/NCTE/SRCAPP14606/B.Ed/AP/2017-18/93858 Date: 06/07/2017

TO BE PUBLISHED IN GAZETTE OF INDIA PART III SECTION 4

ORDER

WHEREAS, recognition was granted to Sri Siva Sai College of Education, Plot No.66/3, Bestavaripeta Village & Post Office, Bestavaripeta Taluk & City, Prakasam District-523334, Andhra Pradesh (SRCAPP14606) for offering B.Ed course of two years from the session 2016-17 with an intake of 100 students vide order No.F.SRO/SRCAPP14606/ B.Ed/AP/2016/84584 dated: 25.04.2016.

AND WHEREAS, on 16.06.2016, the institution submitted a request for change of premises from Bestavaripeta, Prakasam to Pathapattanam, Srikakulam District.

AND WHEREAS, the SRC in its 326th meeting held on 04th – 05th January 2017 considered the matter and the inspection of the institution was conducted on 09.02.2017.

AND WHEREAS, the SRC in its 340th meeting held on 08th & 09th June, 2017 further considered the matter and decided as under;

1. The reply received from the College is seen.
2. They have fulfilled all the requirements.
3. Permit shifting.
4. Correct our records.
5. Issue revised FR(in both cases) with the new address.
6. Inform the SCERT and the University concerned.
7. Close the files.

NOW THEREFORE, this order is issued granting permission for change of premises of the institution from Sri Siva Sai College of Education, Plot No.66/3, Bestavaripeta Village & Post Office, Bestavaripeta Taluk & City, Prakasam District-523334, Andhra Pradesh to Sri Siva Sai College of Education, Plot No. 3/2, Antarabba Village, Patapatnam Mandal, Srikakulam District, Andhra Pradesh for conducting B.Ed course of two years duration with an intake of 100 students (two units of 50 each) subject to fulfillment of the conditions mentioned in order No.F.SRO/SRCAPP14606/ B.Ed/AP/2016/84584 dated: 25.04.2016. The other information/conditions prescribed in the order dated 25.04.2016 shall stand.

ప్రకాశం జిల్లా నుంచి అంతరాబకు తెచ్చుకున్న షిఫ్టింగ్ ఆర్డర్

### కాలేజీ లేదు.. విద్యార్థులున్నారు!

వాస్తవానికి శ్రీశివసాయి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పేరుతో ప్రకాశం జిల్లా బెస్తవారిపేట గ్రామంలో కళాశాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతులు తెచ్చుకున్నారు. కానీ ఏం జరిగిందో తెలీదు గానీ దాన్ని శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం అంతరాబకు షిఫ్ట్ చేసేందుకు వీలుగా నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఈమేరకు గెజిట్ నోటిఫై చేయించారు. కానీ అంతరాబలో ఆ కాలేజీ ఎక్కడుందయ్యా అని వెతికితే.. ఆచూకీ దొరకడంలేదు. ఇన్‌స్పెక్షన్‌కు వెళ్లిన ఎన్‌సీటీఈ, యూనివర్సిటీ అధికారులు మాత్రం కాలేజీ ఉందనే చెబుతున్నారు. చెప్పడమేమిటి.. ప్రతి యేటా ఇక్కడ 110 మంది విద్యార్థులు చదువుతున్నారని, పరీక్షలు రాస్తున్నారని చెబుతూ సర్టిఫికెట్లు కూడా ఇచ్చేస్తున్నారు. ఒక లేని కళాశాల పేరుతో ఇంత తంతు ఎలా జరుగుతుందో జిల్లాలో బీఈడీ కాలేజీల నిర్వాహకులందరికీ తెలుసు. ప్రతి కళాశాలలో అంతో ఇంతో ఏదో ఒక లోపం ఉంటుంది. భవనాలుంటే ప్లేగ్రౌండ్ ఉండదు. ప్లేగ్రౌండ్ ఉంటే సరిపడినన్ని ల్యాబ్‌లు ఉండవు. అందుకే బీఈడీ కళాశాల యాజమాన్యాలు అన్నీ మూసుకొని ఇన్‌స్పెక్షన్‌కు వచ్చేవారిని మేనేజ్ చేసి నెట్టుకొస్తున్నారు. దీనికోసం నానా అవమానాలు పడుతున్నారు.

### ఒక్కోసారి ఒక్కో కాలేజీని వాడకం

కానీ ఒక లేని కాలేజీని ఉన్నట్లు చూపిస్తూ ప్రతి ఏడాది వంద మంది సాధారణ, 10 మంది ఈబీసీ విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు ఫీజులను శివసాయి బీఈడీ కళాశాల దండుకుపోతోంది. అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల నుంచి సర్టిఫికెట్ల సేకరణ, ఫీజుల వసూలు కోసం కొన్నాళ్లు ఇదే అంతరాబలో ఒక బెడ్రూమ్, ఒక బాత్రూమ్ ఉన్న ఇంటిని అద్దెకు తీసుకొని అడ్మిషన్ల తర్వాత ఖాళీ చేసేశారు. అప్పట్నుంచి ఈ కళాశాలలో ఎవరు చేరాలన్నా పర్లాకిమిడిలోని ఒక లాడ్జి రూమ్‌లో ఈ తతంగం నడిపేవారు. అడ్మిషన్లు కళాశాల యాజమాన్యం సొంత వ్యవహారం కాబట్టి గది అద్దెకు తీసుకున్నా, లాడ్జి తీసుకున్నా పోనీలే.. అని సరిపెట్టుకోవచ్చు. కానీ అసలు పాఠాలు చెప్పడానికి భవనం లేకుండా, బోధించడానికి టీచర్లే లేకుండా ప్రతియేటా 100 మందికి పైగా విద్యార్థులను పరీక్షలకు పంపుతున్నారంటే ప్రపంచంలోనే ఇదో పెద్ద వింత. వాస్తవానికి ఏ సొసైటీ పేరుతో బీఈడీ కాలేజీ పెట్టుకున్నారో.. ఆ సొసైటీ పేరుతో సొంత భూమి, అందులో భవనాలు ఉండాలి. దాన్నే జియో ట్యాగింగ్ చేయాలి. కానీ శ్రీ శివసాయి ఎడ్యుకేషనల్ అండర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ పేరుతో నడుస్తున్న బీఈడీ కాలేజీకి ఆ సొసైటీ పేరుతో అంతరాబలో భూమి గానీ, భవనాలు గానీ లేవు. అలాంటప్పుడు ఇన్‌స్పెక్షన్‌కు వచ్చిన అధికారులకు ఈ యాజమాన్యం ఏం చూపించి ఉంటుందనేదే ప్రశ్న! కిరణ్మయి డిగ్రీ ఇంటర్ కాలేజీ భవనాలు చూపించి అదే తమ బీఈడీ కళాశాల అని ఒకసారి మేనేజ్ చేశారు. అక్కడ చదువు చెబుతున్న అధ్యాపకులనే తమ ఫ్యాకల్టీగా చూపించారు. మరోసారి మరో కళాశాలను వాడేశారు. అసలు ఈ కాలేజీ ఏ సొసైటీ పేరు మీద ఉంది? ఆ పేరుతో భవనాలు ఉన్నాయా? లేవా? ల్యాబ్‌లు ఎక్కడున్నాయి? ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎంతుంది? అనేది ఎప్పుడూ ప్రస్తావనకు రాలేదు. కానీ ప్రకాశం జిల్లా నుంచి శ్రీకాకుళం పాతపట్నానికి షిఫ్ట్ అయిన దగ్గర్నుంచి నిరంతరాయంగా అడ్మిషన్లు జరిగిపోతున్నాయి.

### కాగితాల్లోనే అన్నీ..!

బీఈడీ కళాశాలల్లో పాఠాలు చెప్పే అధ్యాపకులు క్వాలిఫైడా, కాదా? అని ప్రతి యేటా వర్సిటీ అధికారులు పరిశీలిస్తారు. అందుకోసం వారి సర్టిఫికెట్లను పట్టుకొని యూనివర్సిటీ అధికారుల ముందు నిలబడాలి. ఇందులో ఏ ఒక్కరు క్వాలిఫై కాకపోయినా ఆ కళాశాలకు రెన్యూవల్ ఉండదు. నిబంధనల మేరకు ఒక బీఈడీ కళాశాలలో 16 మంది స్టాఫ్ ఉండాలి. ఆ మేరకు ప్రతియేటా అందరి సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. అలాగే విద్యార్థుల హాజరుపట్టీ, ల్యాబ్‌ల తీరు కూడా చూస్తారు. ఇందుకోసం యూనివర్సిటీ పరిధిలో ఐదుగురి కమిటీ తనిఖీ చేస్తుంది. వీసీ, రిజిస్ట్రార్, సీడీసీ డీన్, సంబంధిత ఆర్ట్స్ విభాగం ప్రిన్సిపాల్‌తో పాటు ఇద్దరు సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లు బీఈడీ కళాశాలలను తనిఖీ చేయాలి. ఇందులో వీసీ, రిజిస్ట్రార్‌లకు ఒక్కొక్కసారి సీడీసీ డీన్‌కు, యూనివర్సిటీలోనే తెమలని పని ఒత్తిడి ఉంటుంది కనుక వారి బదులు యూనివర్సిటీలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌ను డీల్ చేస్తున్నవారు తనిఖీలకు వెళ్తుంటారు. కానీ ఏరోజూ ఈ బీఈడీ కళాశాల వ్యవహారంపై అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడం విడ్డూరం. చివరకు ఎన్‌సీటీఈ బృందం కూడా ఈ కాలేజీ - మిగతా చివరి పేజీలో

---



- -అంతర్వేది తీరంలో పోలీసుల హెచ్చరిక బోర్డు
- -సముద్ర స్నానానికి దిగిన ఇద్దరిని కుట్టిన కీటకాలు
- -అస్వస్థతకు గురైన వారికి ఆస్పత్రిలో చికిత్స
- -అవి జెల్లీఫిష్‌లని.. ప్రాణాంతకం కావంటున్న నిపుణులు
- -బంగాళాఖాత తీర ప్రాంతాల్లో వీటి కదలికలు అధికం

## వింత జంతువులున్నాయి..

# తస్మాత్ జాగ్రత్త!




పోలీసులు ముందుజాగ్రత్త చర్యగా అంతర్వేది తీరంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

ఈ ప్రాంత జలాల్లో విషజీవులున్నాయి. అందువల్ల సముద్రంలో స్నానానికి దిగవద్దు.

..ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అంతర్వేది సముద్ర తీరం వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బోర్డుపై ఈ హెచ్చరిక కనిపిస్తుంది.

కొత్తగా ఈ హెచ్చరిక ఎందుకు? ఇక్కడ సముద్ర స్నానాలు చేయ డం సంప్రదాయంగా వస్తోంది కదా! ఇప్పుడు కొత్తగా విషజీవులున్నాయి.. ప్రమాదం.. అని హెచ్చరించడం ఏమిటన్న సందేహాలు, ప్రశ్నలు తలెత్తడం సహజం. దానికి కారణమేంటంటే జూన్ 30న ఇక్కడ స్నానానికి సముద్రంలోకి వెళ్లిన ఇద్దరు వ్యక్తులను ఒక వింత జీవి కుట్టింది. దాంతో శరీరమంతా దద్దుర్లు, దురదతో వారు అస్వస్థతకు గురయ్యారు.

ఇదే కాదు.. మూడేళ్ల క్రితం విశాఖ నగరంలోని రుషికొండ బీచ్‌లోనూ ఇటువంటి వింత జీవులు సముద్రజలాల్లో కనిపించి పర్యాటకులను భయాందోళనకు గురిచేశాయి.

వీటినే పరిశోధకులు, ఓషనోగ్రఫీ నిపుణులు జెల్‌ఫిష్‌లు అని చెబుతున్నారు. మిగతా చేపలకంటే ఇవి భిన్నమైనవని, ఇవి కుడితే అస్వస్థతకు గురవుతామని, చికిత్స తీసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. ఇటీవల అంతర్వేది బీచ్‌కు వచ్చిన కొందరు పర్యటకులకు ఇదే చేదు అనుభవం ఎదురైంది. అంతర్వేదిలో కనిపించినవాటిని బ్లూ డ్రాగన్ జెల్లీ ఫిష్ అంటారని జువాలజీ అధ్యాపకులు చెబుతున్నారు. ఇవి విషపురుగులు కావని స్పష్టం చేస్తున్నారు.

### దురద, దద్దుర్లు

అంతర్వేది వద్ద సముద్ర స్నానానికి దిగిన ఇద్దరు వ్యక్తులను ఊదా రంగులో జిగటగా, ముద్దలా ఉన్న జీవి కుట్టింది. దాంతో ఒళ్లంతా దద్దుర్లు, దురదలతో అస్వస్థతకు గురి కాగా స్థానికులు వారిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా ఇద్దరిని అస్వస్థతకు గురి చేసిన ఈ జీవులను అగ్గిబాట పురుగులు(ఒక రకమైన జెల్లీ ఫిష్‌లు)గా స్థానిక మత్స్యకారులు వ్యవహరిస్తుంటారు. ఇవి శరీరానికి తాకినా, కుట్టినా ఆ భాగంలో మంటలు, దురదలు వస్తాయని చెప్పారు. అటువంటప్పుడు బీచ్‌లో స్నానం చేస్తే తగ్గిపోతాయని వారు చెబుతుంటారు. దీనికి ముందురోజు కూడా అంతర్వేది తీరానికి వెళ్లిన కొందరు పర్యాటకులకు ఇదే అనుభవం ఎదురైందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటన వస్తృతంగా వైరల్ కావడంతో అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి పోలీసులు ముందుజాగ్రత్త చర్యగా అంతర్వేది తీరంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

### తూర్పు తీరంలో అధికం

జెల్లీఫిష్‌లకు దాడి చేసే స్వభావం ఉండదని, తమని తాము రక్షించుకోవడానికే కుడతాయని పరిశోధకులు చెబుతున్నారు. పేరులో ఫిష్.. అంటే చేప అని ఉన్నా ఇవి చేప జాతికి చెందినవి కావటం. వీటి శరీరం వూదా రంగులో జిగటగా ముద్దలా ఉంటుంది. అవసరమైనప్పుడు ఇతర జీవులను కుట్టగలిగే సూదిలాంటి సెల్స్ కలిగి ఉంటాయి. కుట్టినప్పుడు వాటి నుంచి ఒక ద్రవం స్రవించి దద్దుర్లు, దురద పుట్టిస్తాయి. కొన్నిసార్లు తీవ్ర అస్వస్థతకు గురి చేయవచ్చు. కానీ ప్రాణాంతకం కావు. వీటికి ఈత కూడా రాదు. అందువల్ల నీటిపై తేలుతూ ప్రవాహం ఎటు వెళ్లే అటు పోతుంటాయి. ఆ క్రమంలో తీరానికి వస్తుంటాయని ఏయూ జువాలజీ ప్రొఫెసర్లు చెబుతున్నారు. మనదేశ తూర్పుతీరంలో అంటే.. విశాఖ, చెన్నై, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల బంగాళాఖాత తీరాల్లో జెల్లీ ఫిష్‌లు అధికంగా కనిపిస్తాయి. ఆ క్రమంలో శ్రీకాకుళం జిల్లా తీరప్రాంతాల్లోనూ ఆ జీవులు కనిపించే ఆస్కారం ఉంది. వీటిలో పోర్చుగీస్ మ్యాన్ ఓవార్, మూన్ జెల్లీ ఫిష్, బ్లూ డ్రాగన్ జెల్లీ ఫిష్‌లతో పాటు మరికొన్ని రకాలు ఉన్నాయి. కాగా అంతర్వేది బీచ్‌లో కనిపించింది బ్లూ డ్రాగన్ జెల్లీ ఫిష్. వీటి స్టింగ్(కొండి)లో మనిషిని అస్వస్థతకు గురిచేసే స్థాయిలోనే విషం ఉంటుంది. జెల్లీ ఫిష్‌లు సముద్రాల్లోనే కాదు.. చెరువులు, సరస్సులు అంటే మంచినీటి వనరుల్లోనూ ఉంటాయి. వేసవి చివరి రోజుల్లో, వర్షాలు ప్రారంభమయ్యే సమయాల్లో తీర ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఈ సమయంలో ఒడ్డుకు వచ్చి పిల్లలను వదులుతాయి. ఆహారం కోసం తీవ్రంగా వెతుకుతాయి. ఆ సమయంలో మనుషులు, ఇతర ప్రాణులు ఎదురైతే తమను తాము కాపాడుకునేందుకు కుడతాయి. జెల్లీఫిష్‌లు కనిపిస్తే అందంగా ఉన్నాయని కొందరు వాటిని పట్టుకునే ప్రయత్నం చేస్తారు. అలాంటప్పుడే అవి ఆందోళనకు గురై కుడతాయి.

### రుషికొండ తీరంలోనూ

విశాఖ రుషికొండ బీచ్‌లో డైవింగ్‌కు వెళ్లిన వారికి పలు సందర్భాల్లో జెల్లీఫిష్‌లు కనిపించాయి. మూడేళ్ల కిందట రుషికొండ బీచ్‌కు ఐదారు కిలోమీటర్ల దూరంలో సముద్రంలో కొందరు డైవింగ్ చేసినప్పుడు పసుపురంగు జెల్లీ ఫిష్‌లు ఈదుతూ కనిపించాయి. వాటిని ఫోటోలు, వీడియోలు తీశారు. అలాగే ఏడేళ్ల కిందట ముంబైలో, ఐదేళ్ల కిందట గోవాలో జెల్లీ ఫిష్‌లు వందల సంఖ్యలో తీరానికి వచ్చి సందర్శకులు, లైఫ్ గార్డులపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయని నేవీ ఉద్యోగులు, స్కూబా డైవర్లు చెబుతున్నారు. సముద్రంలో జెల్లీఫిష్‌లు ఉండటం సహజమే కానీ తీరం సమీపంలోకి రావడం మాత్రం అరుదుగా జరుగుతుంటుంది. రుషికొండ బీచ్‌లో కనిపించిన జెల్లీఫిష్‌లు నాలుగు నుంచి ఐదు మీటర్ల పొడవు ఉన్నాయి. ఈ జీవుల శరీరంలో 95 శాతం నీరే ఉంటుంది. ఇవి చిన్నవైతే గుంపులుగా, పెద్దవైతే ఒంటరిగా సంచరిస్తుంటాయి.

### తీరానికి ఎందుకు వస్తాయి?

సాధారణంగా జెల్లీ ఫిష్‌లు సముద్రం మధ్య భాగాల్లో తేలియాడుతూ జీవిస్తాయి. కానీ సముద్రపు గాలుల దిశ మారడం, ప్రవాహాల ప్రభావం వల్ల ఒడ్డుకు కొట్టుకొస్తాయి. అలాగే సముద్రపు ఉష్ణోగ్రత పెరిగినపుడు, కొన్ని జెల్లీ ఫిష్‌లు చల్లటి నీటిని వెతుక్కుంటూ తీరం వైపు కదులుతుంటాయి. మరికొన్ని రకాల జెల్లీ ఫిష్‌లు చిన్న జీవులను ఆహారంగా తీసుకుంటూ, అవి ఎక్కువగా ఉండే తీర ప్రాంతాల దిశగా వస్తుంటాయి. 'జెల్లీఫిష్ శరీరానికి తాకితే ఆ భాగాన్ని కొబ్బరినూనె, వెనిగర్, ఉప్పునీటితో శుభ్రపరచాలి. ఎందుకంటే విషపూరితమైన సూదుల్లాంటి నెమటోసిస్ట్‌లు చర్మంలో ఉండిపోతాయి. అవి మళ్లీ విషం విడుదల చేసే ప్రమాదం ఉంటుంది. శరీర భాగాన్ని శుభ్రపరిస్తే నెమటోసిస్టులు చనిపోతాయి.

• ఎడిటోరియల్

# కాళేశ్వరం కాసులన్నీ వారి వద్దే!

తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, కార్యక్రమాల్లో అత్యంత వివాదాస్పదం, లోపభూయిష్టమన్న విమర్శలను కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు మూటగట్టుకుంది. నాటి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా, గోదావరి జలాలతో తెలంగాణ బీళ్లను మాగాణులుగా మార్చేస్తామంటూ ఈ ప్రాజెక్టును చేపట్టింది. కానీ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయినా ఆశించిన ఫలాలను మాత్రం ఇవ్వలేకపోతోంది. ఎక్కడికక్కల పైపులైన్ల లీకేజీలు, రిజర్వాయర్ల గట్లు తెగిపోవడం వంటి అనేక కారణాలతో ఆయకట్టుకు నీరందడంలేదు. దీని నిర్మాణమే అత్యంత నాసిరకంగా ఉందని, దీని నిర్మాణానికి వెచ్చించిన వేల కోట్లు వృథా అయినట్లేనని ఇంజినీరింగ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇదే సమయంలో ఇటీవల ఆ రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ జరిపిన దాడుల్లో ముగ్గురు పెద్దస్థాయి అవినీతిపరులు దొరికిపోయారు. విశేషమేమిటంటే.. ఈ ముగ్గురూ నాసిరకం నిర్మాణాలన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పర్యవేక్షించినవారే. కేవలం ఈ ముగ్గురి వద్దే ఏకంగా రూ.వెయ్యి కోట్ల అక్రమ ఆస్తులను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. ఇదంతా కాళేశ్వరం సొమ్మేనని అంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన అధికారులందరూ కోట్లు కూడబెట్టుకున్నారని ఏసీబీ దాడుల ద్వారా అర్థమవుతుంది. ఇప్పటి వరకూ ముగ్గురు నీటి పారుదల శాఖ అధికారులపై ఏసీబీ అధికారులు దాడులు జరపగా దాదాపు రూ.వెయ్యి కోట్ల అక్రమ ఆస్తులు కనుగొన్నారంటే ఆ ముగ్గురు అధికారులు ఏ రేంజ్‌లో అవినీతికి పాల్పడ్డారో వేరే చెప్పనక్కర్లేదు. నీటిపారుదలశాఖ మాజీ ఈఎన్సీ మురళీధరావు ఆస్తుల విలువ రూ.600 కోట్లకుపైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌లో విలువైన భూములు, ఇళ్ల స్థలాలతో పాటు పవర్ ప్రాజెక్టు, విల్లాతో పాటు బంగారం, వెండి ఆభరణాలు ఉన్నట్లు ఆయన ఇంట్లో జరిపిన సోదాల్లో వెల్లడైంది. మోకిలాలో 6,500 చదరపు గజం స్థలంతో పాటు హైదరాబాద్ శివార్లలో పదకొండు ఎకరాల సాగు భూమి కూడా ఉంది. జహీరాబాద్‌లో టూ కేవీ సోలార్ పవర్ ప్రాజెక్టు, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో నాలుగు ఫ్లాట్లు, నాలుగు ఇళ్లస్థలాలు ఉన్నట్లు కనుగొన్నారు. బ్యాంకు లాకర్ ఓపెన్ చేస్తే మరిన్ని ఆస్తులు బయటపడే అవకాశముందని భావిస్తున్నారు. దీనికి కొన్నాళ్ల క్రితం కాళేశ్వరం ప్రాజెక్టు మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూనె శ్రీధర్ నివాసాల్లోనూ సోదాలు చేశారు. ఆయనకు రూ.200 కోట్లకుపైగా లెక్కలు చూపని ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో కమర్షియల్ కాంప్లెక్స్, తెల్లాపూర్‌లో విల్లాతో పాటు కరీంనగర్‌లో మూడు ఇళ్లు, షేక్‌పేట్‌లో ఒక ఫ్లాట్, ఇంకా వ్యవసాయ భూములు ఉన్నట్లు సోదాల్లో వెల్లడైంది. కరీనంగర్, హైదరాబాద్, వరంగల్ నగరాల్లో ఆయనకు ఏకంగా పందొమ్మిది ఓపెన్ ప్లాట్లు ఉన్నాయని దర్యాప్తులో తెలిసింది. పదహారు ఎకరాల వ్యవసాయ భూమి కూడా ఉంది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టుకు గతంలో ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)గా పని చేసిన హరిరామ్ కూడా కళ్లుచెదిరే ఆస్తులు కూడబెట్టారు. అవన్నీ ఏసీబీ సోదాల్లో బయటపడ్డాయి. హరిరామ్ నివాసాలతో పాటు ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. హరిరామ్ భార్య కూడా ఇంజినీరింగ్ అధికారిగా పని చేస్తుండటంతో ఆమె ఇళ్లలోనూ తనిఖీలు నిర్వహించారు. హరిరామ్‌కు శామీర్‌పేట్‌లో ఒక విల్లాతో పాటు, కొండాపూర్‌లో విల్లా, శ్రీనగర్ కాలనీలో ఒక ఫ్లాట్‌తో పాటు మాదాపూర్ లోనూ మరొక ఫ్లాట్ ఉందని తేల్చారు. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోనూ కమర్షియల్ స్పేస్‌ను హరిరామ్ కొనుగోలు చేసినట్లు ఏసీబీ అధికారులు కనుగొన్నారు. మర్కూక్ మండలంలో ఇరవై ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమి, మిర్యాలగూడలో మామిడితోట, రెండు బీఎండబ్ల్యూ కార్లు ఉన్నట్లు నిర్ధారించారు. ఇలా.. కాళేశ్వరం ప్రాజెక్టు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించిన మూడు పెద్ద తలకాయల వద్దే రూ.వెయ్యి కోట్ల అక్రమార్జన ఉంటే.. ఇక మిగిలిన అన్ని స్థాయిల్లో ఎన్ని అక్రమాలు జరిగాయో.. ప్రాజెక్టుకు చెందిన ఎన్ని కోట్ల నిధులు దారిమళ్లాయో ఊహించశక్యం కాదు. ఇవన్నీ వెరసి ఒక భారీ నీటి పారుదల ప్రాజెక్టును పనికిరాని తెల్ల ఏనుగులా మార్చేశాయి. డిజైనింగ్‌తో సహా అడుగడుగునా చోటు చేసుకున్న నిర్మాణ లోపాలు, నాసిరకం నిర్మాణాలు అధికారులకు, రాజకీయ పెద్దలకు కాసులు కురిపిస్తే.. దానిపై ఆశలు పెట్టుకున్న రైతులకు మాత్రం నిరాశే మిగిలింది.

## ఇసుకర్యాంపు వద్ద ధర్నా

(సత్యంన్యూస్, కొత్తూరు)

మండలంలోని బలద రెవెన్యూ పంచాయతీలో గల ఇసుక ర్యాంపు వద్ద ఇసుక తవ్వకాలు ఆపాలని మంగళవారం రైతులు పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ ఇసుక తవ్వకాల కారణంగా పొలాలకు వెళ్లే గొర్జి పాడవుతుందని, తుఫాను సమయంలో పంటభూములు నీట మునుగుతాయని క్రిందనే ఉన్న ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందక రైతులు ఇబ్బంది పడతారన్నారు. ఇప్పటికే పలుమార్లు గ్రామ ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు సదరు ర్యాంపులో ధర్నాకు దిగారు. రైతులను బెదిరిస్తూ ఇసుకర్యాంపు నిర్వాహకులు ర్యాంపు నడిపిస్తున్నారని పలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.




## కార్పొరేట్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలకు తిలోదకాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని కొన్ని కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయని శ్రీకాకుళం జిల్లా ప్రజా సమస్య పరిష్కార వేదిక అధ్యక్షులు బెవర వెంకట రవి శంకర్ విమర్శించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ, కనీస సౌకర్యాలు కల్పించడంలో ఘోరంగా విఫలమవుతున్నాయన్నారు. ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, యాజమాన్యాల రాజకీయ పలుకుబడితో తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడానికి వెనకాడుతున్నారన్నారు. ర్యాంకుల వెంట పరుగులు తీస్తూ, విద్యార్థుల సమగ్ర వికాసాన్ని విస్మరిస్తున్న ఈ కార్పొరేట్ విద్యాసంస్థలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 6.30 గంటల వరకు సుమారు 10గంటల పాటు కళాశాలల్లో గడిపే విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయని, విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో, బాలికలు ముఖ్యంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్యూలో నిలబడి, ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కనీస పరిశుభ్రతకు నోచుకోని ఈ మరుగుదొడ్లు విద్యార్థుల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారాయన్నారు. బాలికలు ఋతుస్రావ సమయంలో పడే అవస్థలు వర్ణనాతీతమన్నారు. ఏసీ సౌకర్యం పేరుతో అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, చాలా తరగతి గదుల్లో ఏసీలు పనిచేయడం లేదన్నారు. ఉన్న ఏసీలు కూడా తరచుగా మొరాయిస్తుండటంతో, విద్యార్థులు ఉక్కపోతతో అల్లాడుతున్నారన్నారు. ఫ్యాన్లు కూడా సరిగా తిరగకపోవడంతో వాతావరణం మరింత దుర్భరంగా మారుతోందన్నారు. ఇది మాత్రమే కాదు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేయడానికి కూడా కళాశాల యాజమాన్యాలు అదనంగా రూ. 3,000 వసూలు చేస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. క్యాంటీన్లలో ఆహార నాణ్యత కూడా దారుణంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారన్నారు. కార్పొరేట్ కళాశాలల ప్రధాన లక్ష్యం కేవలం ర్యాంకులను సాధించడమే తప్ప, విద్యార్థులకు సబ్జెక్టుపై లోతైన అవగాహన కల్పించడం లేదన్నారు. పాఠ్యపుస్తకాలు బోధించకుండా, కేవలం పరీక్షలను దృష్టిలో ఉంచుకొని బోధన సాగిస్తున్నారని, సబ్జెక్టుపై పట్టు సాధించలేని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విద్యలోను ఉద్యోగ రంగంలోను ఇబ్బందులు పడతారని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. విద్యార్థుల వికాసానికి కృషి చేయకుండా, కేవలం మార్కులను, ర్యాంకులను లక్ష్యంగా పెట్టుకోవడం విద్యావ్యవస్థకే ప్రమాదకరమన్నారు. కళాశాలల యాజమాన్యాలు అధికార పార్టీలో ఉన్నత పదవుల్లో ఉండటంతో, తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారన్నారు. పిల్లల భవిష్యత్తుకు ఆటంకం కలుగుతుందేమోనన్న ఆందోళనతో, కష్టాలను సహించమంటూ తమ పిల్లలకే సర్దిచెబుతున్నారన్నారు. ఈ రాజకీయ పలుకుబడి కారణంగా, కార్పొరేట్ కళాశాలలు నిబంధనలను తుంగలో తొక్కి, విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఒత్తిడి నుంచి బయట పడటానికి ఒక్క ఆదివారమే సెలవు రోజని, కానీ చాలా కళాశాలలు ఆరోజు కూడా పరీక్షలు పెట్టి, యూనిఫారం లేకుండా రమ్మంటున్నారన్నారు. ఇటీవల ఒక కార్పొరేట్ కళాశాలలో కాలం చెల్లిన జనరేటర్ మంటలు వచ్చి, కళాశాల మొత్తం పొగలు కమ్ముకున్నాయని, కళాశాల సిబ్బంది అప్రమత్తమై విద్యార్థులను ఇంటికి పింపించేశారన్నారు. కళాశాల వెళ్లే రోడ్లు కూడా చాలా దారుణంగా ఉన్నాయని, ముఖ్యంగా జిల్లా కోర్టు వెనుక వైపు గల అయిదారు కళాశాలు ఉన్నాయని, ఈ రోడ్లు చూస్తే గ్రామాల్లో కూడా ఇంత దారుణంగా ఉండవన్నారు. విద్యార్థుల పడే కష్టాలు వర్ణణతీతంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి, పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## గణనీయంగా పెరిగిన అడ్మిషన్లు

(సత్యంన్యూస్, నరసన్నపేట)



స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయని ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల తెలిపారు. గత ఏడాది మొత్తం విద్యార్థుల సంఖ్య 452 కాగా, ఈ ఏడాది 513కి చేరిందన్నారు. మొత్తమ్మీద 61మంది ఎక్కువగా చేరినట్లు తెలిపారు. విద్యార్థుల అడ్మిషన్లు పెరిగేందుకు కృషిచేసిన సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరగడం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలు అందజేయడం వంటి కీలక అంశాలు విద్యార్థులు చేరేందుకు కారణాలు కాగా, మరోపక్క తల్లిదండ్రుల వద్దకు అధ్యాపకులు వెళ్లి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించడం కూడా సానుకూల ఫలితాలు ఇచ్చిందన్నారు. ఎఫ్ఏసీ విధానాలకు స్వస్తి పలికి రెగ్యులర్ ప్రిన్సిపాల్స్‌ను నియమించడం, సైన్స్ విద్యార్థులకు ఎంసెట్ నీట్ మొదలగు పోటీ పరీక్షల మెటీరియల్ పంపిణీ చేయడం, ఖాళీగా ఉన్న పోస్టుల స్థానాల్లో అతిథి అధ్యాపకులను భర్తీ చేయడం వంటి చర్యలు అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు దోహదం చేశాయని పవన్ తెలిపారు. నరసన్నపేట కళాశాల విద్యార్థులు ఏడుగురు ఏపీఆర్డీసీ నాగార్జునసాగర్‌కు, కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలకు ఎంపిక కావడం, ఏపీఎంసెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడం తమ కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చాయని వెల్లడించారు. కళాశాలలో విశాలమైన లైబ్రరీ, లేబరేటరీలు, ఆట స్థలం వంటి సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. కళాశాలలో నాలుగు జనరల్ కోర్సులు, మూడు వృత్తివిద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఈనెల 31వ తేదీ వరకు పదో తరగతి పాసైన విద్యార్థులెవరైనా కళాశాలలో ప్రవేశం పొందవచ్చని పవన్ కోరారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## ఏజ్ గ్యాప్: కస్సుమన్న శృతిహాసన్



ఇండస్ట్రీలో హీరోలకి ఉన్నంత లాంగ్ కెరీర్ హీరోయిన్స్‌కి ఉండదు. చాలా మంది హీరోయిన్స్ ఒక 10 ఏళ్ల పాటు ఓ వెలుగు వెలిగి ఆటోమేటిగ్గా ఫేడ్ అవుట్ అయిపోతారు. హీరోలు మాత్రం జనరేషన్స్‌కి కథానాయకులుగా కొనసాగుతుంటారు. అందుకే కథానాయిక విషయంలో ఎప్పుడూ ఏజ్ గ్యాప్ అనేది ఉండనే ఉంటుంది. దీనిపై ట్రోల్స్ కూడా సర్వసాధారణంగానే జరుగుతుంటాయి.

ఇటీవల థగ్ లైఫ్ సినిమాలో కమల్‌హాసన్, త్రిషతో రొమాన్స్ చేయడం సోషల్ మీడియాలో చాలా హాట్ టాపిక్ అయింది. డైరెక్టర్ మణిరత్నం దీనిపై స్పందిస్తూ "మీరు రెండు పాత్రలనే చూడండి. కమలహాసన్, త్రిషని ఎందుకు చూస్తున్నారు. ఆ ఏజ్ గ్యాప్ రిలేషన్‌షిప్ మన సొసైటీలో ఉన్నాయి. సొసైటీలో ఉన్న పాత్రలనే తెర మీద చూపించడం జరుగుతుంది" అని సమాధానం ఇచ్చారు. తాజాగా శృతిహాసన్‌కి ఇలాంటి ప్రశ్న ఒకటి ఎదురైంది. కూలీ సినిమాలో ఒక కీలక పాత్ర చేస్తుంది శృతి. ఆమెది హీరోయిన్ పాత్ర కాదు అయినప్పటికీ రజినీకాంత్ ఉండడంతో ఆటోమేటిక్‌గా అలాంటి ప్రశ్న ఒకటి తలెత్తుతుంది. ఇదే ఏజ్ గ్రూప్ గురించి ఆమె దగ్గర ప్రస్తావిస్తే ఒక రకమైన అసహనాన్ని వ్యక్తం చేసింది. "నాకు ఎవరి సంగతి తెలియదు. నేను ఏజ్ సంగతి పట్టించుకోను. మాట్లాడుకునే వాళ్లు బోలెడు మాట్లాడుకుంటారు. నా వరకు నాకు వచ్చిన పాత్రను చేయడమే నాకు తెలుసు. ఒక పాత్రనే చూస్తాను తప్పితే అందులో ఏజ్ ని చూడను" అని కాస్త కరుకుగానే సమాధానం చెప్పింది శృతి. కూలీలో స్ట్రాంగ్ విమెన్ క్యారెక్టర్ చేసిందట శృతి. లోకేష్ కనకరాజు సినిమాలన్నీ చాలా డార్క్ జానర్లో, అలాగే కేవలం మగవాళ్లకి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చే పాత్రలు ఎక్కువగా ఉంటాయి. కానీ ఇందులో శృతిహాసన్‌కి మాత్రం చాలా బలమైన ఒక స్త్రీ పాత్రని చేసే అవకాశం దొరికిందట. అందుకే మరో ఆలోచన లేకుండా ఈ సినిమా చేసిందట. ఆగస్టు 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...




## సిద్ధు.. మాంగల్యం కట్టే సమయం

డీజే టిల్లు ఇచ్చిన జోరుకి జాక్ అడ్డుకట్ట వేసింది. ఇప్పుడు సిద్ధు జొన్నలగడ్డ నుంచి మరో కొత్త సినిమా ముస్తాబౌతోంది. స్టైలిస్ట్ నీరజా కోన తొలిసారి మెగాఫోన్ పట్టుకుంది. వీరిద్దరి కాంబినేషన్ లో తెలుసు కదా సినిమా రెడీ అవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ. థమన్ మ్యూజిక్. తాజాగా ఈ సినిమా నుంచి మల్లికా గంధ పాటని రిలీజ్ చేశారు. తమన్ మంచి మెలోడీ చేసి చాలా కాలమైయింది. 'కళావతి' పాట తర్వాత మళ్ళీ అంతటి వైరల్ మెలోడీ రాలేదు. ఇప్పుడు తెలుసు కదా కోసం ఆ దారిలో ఓ ట్యూన్ ప్రయత్నించాడు. సిద్ శ్రీరామ్ తో పాడించారు. ట్యూన్ క్యాచి గానే వుంది. సిద్ధు, రాశీ ఖన్నా కెమిస్ట్రీ కొత్తగా అనిపించింది.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

## చీరకట్టులో అనసూయ!



టాలీవుడ్‌లో యాంకర్‌గా, నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అనసూయ భరద్వాజ్ ఇప్పుడు మరోసారి తన ట్రెడిషనల్ లుక్స్‌తో ఎట్రాక్ట్ చేసింది. బ్లాక్ అండ్ గోల్డ్ కలర్ చీరకట్టులో అనసూయ పోస్ట్ చేసిన తాజా ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. మురారి చెప్పమ్మ పాటను బ్యాక్‌డ్రాప్ మ్యూజిక్‌గా ఎంచుకుని పోస్ట్ చేసిన ఈ ఫోటోలు ఆమె అందం, ఎమోషన్, క్లాస్‌ను బాగా చూపిస్తున్నాయి. వింటేజ్ అండ్ ట్రెడిషనల్ లుక్ మిక్స్‌లో కనిపించే ఈ చీర అనసూయ అందాన్ని మరో లెవెల్‌కి తీసుకెళ్లింది. మినిమల్ మేకప్, జుమ్కాలు, గాజుల హంగు ఇవన్నీ ఆమె లుక్‌ని మరింత రిచ్‌గా మార్చాయి. ఎక్స్‌ప్రెషన్ నుంచి ఎలిగెన్స్ వరకూ, అనసూయ తన స్టన్నింగ్ స్టైలింగ్‌తో మరోసారి ప్రూవ్ చేసింది. అనసూయ కెరీర్ విషయానికి వస్తే, ఆమె మొదట టీవీ యాంకర్‌గా పాపులర్ అయినా, తర్వాత జబర్దస్త్ షోతో ఓ భారీ క్రేజ్ సంపాదించింది. ఆ తర్వాత సోగ్గాడే చిన్నినాయన, రంగస్థలం, పుష్ప వంటి సినిమాల్లో నటించి వెండితెరపైనా ప్రేక్షకులను మెప్పించింది. ముఖ్యంగా రంగస్థలంలో రంగమ్మత్త పాత్ర ద్వారా ఆమెకి వచ్చిన గుర్తింపు ఇప్పుడు కూడా చర్చలో ఉంటుంది. తాజాగా అనసూయ వెబ్‌సిరీస్‌లలో కూడా కనిపిస్తూ నటనకు విభిన్న రంగులు జోడిస్తోంది. ఆమె సెలెక్ట్ చేసుకునే పాత్రలు, సోషల్ మీడియాలో ఉండే యాక్టివ్ నేచర్, మరియు స్టైలిష్ ఫొటోషూట్లు ఆమెను కంటెంట్ క్రియేటర్లకు, ఫ్యాషన్ ఫాలోవర్లకు ఇన్‌స్పిరేషన్‌గా నిలుపుతున్నాయి. ఈ మధ్య కాలంలో వచ్చిన ఫోటోషూట్లు ప్రతి ఒక్కటీ ప్రత్యేకతను చూపించడంలో విజయవంతం అయ్యాయి. ఈ ట్రెడిషనల్ లుక్‌లో అనసూయ అందం మాత్రమే కాదు, ఆమె ఫొటోషూట్స్ కూడా స్పెషల్‌గా నిలుస్తున్నాయి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# గుండె తడిని తట్టిన 'నాయక్'డు



- ఆయన ఒడిశా మాంఝీ
- రెండేళ్లలో ఒంటరిగానే 8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం
- కలెక్టర్‌ను కదిలించిన కథనం
- గుమ్మాహి వెళ్లి నాయక్‌ను కలిసిన డాక్టర్ బృంద
- 7 కిలోమీటర్ల రోడ్డుకు నిధులు మంజూరు
- పర్యవేక్షణ బాధ్యత నాయక్‌కే అప్పగించిన కలెక్టర్
- ఇప్పుడా ఊరికి విద్యుత్, తాగునీరు






ଦୃଢ଼ ଇଚ୍ଛା ଆଗରେ ହାର୍ ମାନିଲା ଶକ୍ତ ପାହାଡ଼
 କୋଡ଼ି ଓ ଶାବଳରେ ରାସ୍ତା ତିଆରି କଲେ ଜଳନ୍ଧର



**ఆ**మె.. డాక్టర్ బృంద ఐఏఎస్.. కాంధమాల్ అనే జిల్లాకు కలెక్టర్ ఆమె..! కాస్తోకూస్తో జనం కోణంలో ఏదైనా మంచి చేయాలనుకునే కలెక్టర్..! అదసలే ఒడిశా.. బీమారు రాష్ట్రాల్లో ఒకటి.. అంతులేని పేదరికం, జాడ తెలియని అభివృద్ధి. అనేకానేక గ్రామాలకు రోడ్లుండవు, చదువు అసలే ఉండదు, వైద్యం అందదు.. ఆమె ఓ రోజు పత్రికలు చదువుతుంటే ఆమెను ఓ వార్త ఆకర్షించింది.

అది సంపూర్ణంగా చదివింది.. వివరాలు తెప్పించుకుంది. ఓ కలెక్టర్‌గా సిగ్గుపడింది. ఈ వ్యవస్థకు ఏమీ చేయలేకపోతున్నాను సుమా అని తలవంచుకుంది. డ్రైవర్‌ను పిలిచింది, గుమ్మాహి అనే ఊరి దగ్గరకు తీసుకువెళ్లాలని చెప్పింది. డ్రైవర్ పరేషాన్.. ఆమె బయల్దేరింది.

ఆ ఊరు చేరుకుంది.. ఇక్కడ జలంధర్ నాయక్ అంటే ఎవరు అని అడిగింది... ఏమిటీ కథ నేపథ్యం..? ఆయన ఓ మట్టిమనిషి. వయసు 45 సంవత్సరాలు. పుల్బనీ తాలూకాలోని గుమ్మాహి తన సొంతూరు. ఒంటిచేత్తో కొండను తొలిచి తమ ఊరికి రోడ్డు వేసిన బీహారీ దశరథ్ మాంఝీ కథ తెలుసు కదా.. సేమ్, ఆయన ఒడిశా మాంఝీ. ఎందుకో తెలుసా..? తనూ అంతే. ఆ ఊరికి రోడ్డు లేదు, నిజం చెప్పాలా..? కరెంటు కూడా లేదు, మంచినీటి సరఫరా ఆశించేదే లేదు.

ఒక్కొక్కరే ఊరు విడిచి వెళ్లిపోయారు. ఆ స్థితిలో ఆ ఊరికి రోడ్డు తనే సొంతంగా వేయాలని నిర్ణయం తీసుకున్నాడు ఈ జలంధర్. ఎందుకు..? తన ఊరి నుంచి పుల్బనీలోని పాఠశాలకు పిల్లలు వెళ్లాలన్నా అవస్థలే. ఎవరిని ఎన్నేళ్లు వేడుకున్నా ఫలితం లేదాయె. లంచాలు తప్ప ఇంకేమీ తెలియని అధికారులకు అస్సలు పట్టదాయె. అసలు ఈ దేశానికి పట్టిన దరిద్రమే ఈ నాయకులు, ఈ అధికారులు అని అర్థమైంది. దాంతో ఓ ఆలోచనకు వచ్చాడు. కనీసం తన ఊరికి రోడ్డు వేసుకోలేనా..? భార్య సద్దిమూట కట్టి ఇచ్చింది. ఓ పలుగూ, ఓ పార పట్టుకుని బయల్దేరాడు. రోజూ పొద్దున మొదలుపెట్టి సాయంత్రం దాకా తనే రోడ్డు వేయడం మొదలు పెట్టాడు.

రాళ్లూరప్పల్ని తొలగిస్తూ, రోడ్డు వేసుకుంటూ పోతున్నాడు. మొత్తం 15 కిలోమీటర్ల రోడ్డు తన టార్గెట్. ఒక్కడూ సహకరించినవాడు లేడు. అయితేనేం..? ఆ గడ్డపార ఆగలేదు, ఆ పార అలిసిపోలేదు. రెండేళ్లు.. నమ్మండి.. రెండేళ్లపాటు కష్టపడ్డాడు.

నా జీవిత లక్ష్యం అదే అని తీర్మానించుకుని అదే పనిలో మునిగిపోయాడు. 8 కిలోమీటర్ల రోడ్డు తనొక్కడే నిర్మించాడు. ఓరోజు 'గుండెలో తడి' ఇంకా మిగిలిన ఓ స్థానిక పత్రిక జర్నలిస్టు ఆ కథను రాశాడు. అదీ ఆ కలెక్టర్ దగ్గరకు చేరింది. ఆమె చదివింది. ఆమె కళ్లు చెమర్చాయి.

ఈ వ్యవస్థలో భాగమైన తను కూడా సిగ్గుపడాలి కదానే భావన ఆమెను తలవంచుకునేలా చేసింది. అందుకే ఆ ఊరికి బయల్దేరింది.. అతన్ని కలిసింది.. మాట్లాడింది.. 'ఏం లేదు మేడమ్.. మూడేళ్లు ఆగండి, నేనా రోడ్డును పూర్తి చేస్తాను' అన్నాడు జలంధర్. ఆమె మరింత సిగ్గుపడింది.. ఓసారి రోడ్డు చూద్దామంటూ వెళ్లింది.

ఒక మనిషి శ్రమను, లక్ష్యాన్ని, నిబద్ధతను, కష్టాన్ని, సంకల్పాన్ని చూసింది. ఆమెలో కలెక్టర్ అనే పాత్ర నిద్రలేచింది. అయ్యా, మీ త్యాగం నిరుపమానం అని ఆయన చేతులు పట్టుకున్నది. మిగతా ఆ ఏడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం ఇక నాకు వదిలెయ్ అని చెప్పింది. తనకు అందుబాటులో ఉన్న ఏవో నిధులను అడ్జస్ట్ చేసింది. ఆ రోడ్డు పూర్తయ్యేదాకా దాని నిర్మాణ పర్యవేక్షణకూ తననే నియమించింది. అంతేకాదు, ఇప్పుడా ఊరికి కరెంటు పోల్స్, లైన్స్ పడుతున్నాయి. మంచినీటి సరఫరా ప్రణాళికా రూపుదిద్దుకున్నది.


మరో విషయం.. ఈ రెండేళ్లపాటు తను చేసిన పనికి ఉపాధిహామీ కింద డబ్బులు ఇవ్వటానికి కూడా ఆమె అంగీకరించింది. వావ్.. ఇవీ కదా సక్సెస్ స్టోరీలు.. ఇవీ కదా పది మందికీ స్ఫూర్తినిచ్చే అసలు విజయగాథలు..!!

- సత్యం ఐటీ డెస్క్



# కట్టప్పా.. రాజ్యంలో ఏం జరుగుతుంది?..








'కట్టప్పా .. రాజ్యంలో ఏం జరుగుతుంది?..'

'భళ్లాలదేవ సూపర్ మార్కెట్ పెట్టి ఒక్క పుట్టగొడుగు ఐదు లక్షలకు అమ్ముతున్నాడు తల్లీ!'

'పుట్టగొడుగులు అనగానేమి కట్టప్పా?'

'నాకూ తెలీదు తల్లీ .. చిన్నప్పుడు పొలం గట్టు వెంబడి వెళ్తుంటే చెట్ల మధ్యలో యేవో గొడుగులు చూపించి అవే పుట్టగొడుగులు అని మా తాత చుట్టప్ప చెప్పేవాడు తల్లీ!'

'అయినా ఆ గొడుగులు ఐదు లక్షలు పెట్టి కొనుక్కునే సామంత రాజులు ఇంకా ఉన్నారంటావా?'

'వెర్రి వేయివిధాలు అన్నారు కదా తల్లీ.. అది క్యాచ్ చేసే మన భళ్లాలదేవ ఆ దుకాణం పెట్టాడు తల్లీ'

'సరే ఏదో మార్కెట్ అన్నావ్? భళ్లాలదేవ అక్కడేం చేస్తాడు?'

'అమ్ముతాడు తల్లీ'

'ఎవర్ని?'

'ఇంకా ఎవరిజోలికీ వెళ్ళలేదు తల్లీ.. అవీ ఇవీ అని లేదు దొరికినవన్నీ ఇందులో అమ్మేస్తున్నాడు తల్లీ'

'అవునా కట్టప్పా' భళ్లాలదేవుడికి చిన్నప్పటి నుంచీ బిజినెస్సు మైండూ.. అన్నీ వాడి తాత పోలికలు వచ్చాయి.. సరే గొడుగులతో పాటు రైను కోటులు కూడా అమ్ముతున్నాడా?'

'పొరబడుతున్నావ్ తల్లీ.. మన భళ్లాలదేవుల వారు ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర గొడుగులూ.. రైనుకోటులూ అమ్మట్లేదు తల్లీ.. మన రాజ్యంలోనే ఆ కొండలవీ ఉంటాయే బంజారాహిల్స్‌లో దుకాణం పెట్టాడు తల్లీ'

'అవునా !ఆ దుకాణం నామధేయం ఏమి ?'

'ఫుడ్ స్టోరీస్ తల్లీ'

'పేరు కడు విచిత్రముగా ఉన్నది కట్టప్పా'

'అవును తల్లీ బాహుబలి వెళ్లిపోవడంతో స్టోరీలు లేక ఇలా ఫుడ్ స్టోరీస్ పెట్టాడు తల్లీ'

'భళా! ఫుడ్ స్టోరీస్‌లో ఏమి దొరుకును?'

'ఏమి దొరకవు అని అడుగు తల్లీ.. బాబు అన్నీ దింపేసాడు.. కాకపోతే అన్నీ మన స్థాయికి తగ్గకుండా అమ్ముతున్నాడు తల్లీ.. పావు కిలో టమోటా 850 రూపాయలు మాత్రమే తల్లీ'

'ఔరా! అంత ధరయా?'

'ఆశర్యపోకు తల్లీ అది పక్కదేశం నెదర్లాండ్స్ నుంచి తెప్పించిన టమోటాలు.. కొబ్బరిబోండాం వెయ్యి రూపాయలు.. అది థాయిలాండ్ బోండాం తల్లీ'

'ఏమిటీ ధరవరలు కట్టప్పా.. సామాన్యుడు కొనగలిగేవేనా? ఇటువంటి దుకాణాలు పెట్టి భళ్లాలదేవుడు మాహిస్మతి సామ్రాజ్యాన్ని ఆ చైనావాడికి తాకట్టు పెట్టే విధంగా ఉన్నాడే?'

'తప్పు తల్లీ శుభం పల్కవలె.. బాబు తెలివితేటలు మీకు తెలియంది కాదు.. ఆయన దుకాణం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగటానికి మన సామంత రాజులు చాలు తల్లీ'

'సరే మన బాహుబలి ఎక్కడ?'

'అనుష్కతో కొద్దిగా గ్యాప్ రావడంతో ప్రస్తుతం పొరుగు రాజ్యం యువరాణికి లైనేస్తున్నాడు తల్లీ'

'సరే .. ఇవాళ నీ పనులేంటి?'

'ఖాళీనే తల్లీ.. మీరు ఎవడినన్నా వెనకనుంచి పొడిచి రమ్మంటే పొడిచొస్తా తల్లీ'

'నా మాటే శిలాశాసనం.. ఎవడ్ని పొడవాలో తర్వాత చెప్తా.. అందాక భళ్లాలదేవుడి దుకాణానికి వెళ్లి ఒక పది గొడుగులు పట్రా'

పది గొడుగులా? అక్కడ బాబు ఒక్కో గొడుగు ఐదు లక్షలకు అమ్ముతున్నాడు అన్నెప్తుంటే ఈవిడేంటి పది గొడుగులు తెమ్మంటుంది.. తినడానికా? పంచిపెట్టడానికా? పైగా శిలాశాసనం అంటుందేంటీ? ఇంకెక్కడి శిలాశాసనం.. ఎప్పుడో కిలో శాసనం అయిపోతేనూ.. అని మనసులోనే పరిపరి విధముల ఆలోచించుతూ కట్టప్ప గొడుగుల కోసం బయలుదేరెను.

**(ఇది వీరమల్లు మాదిరి కల్పిత కథ.. సరదాగా రాయబడింది.. ఇందులో పాత్రలూ, సన్నివేశాలు ఎవర్నీ ఉద్దేశించినవి కాదు.. చిత్తగించవలెను)**

- పరేష్ తుర్లపాటి















## 3వ డివిజన్ తంగివానిపేటలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నియోజకవర్గ పరిధి 3వ డివిజన్ తంగివానిపేటలో మంగళవారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని డివిజన్ ఇన్‌ఛార్జి తంగి అప్పన్నస్వామి, గ్రామ పెద్దలు, యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పన్నస్వామి మాట్లాడుతూ రైతు భరోసా ఇప్పటికి పడలేదని, ఫ్రీ గ్యాస్ సిలిండర్ ఒకటే అందిందని అన్నారు. అమలుచేయలేని హామీలిచ్చి చంద్రబాబు ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైకాపా పట్టణ అధ్యక్షులు సాధు వైకుంఠరావు, పట్టణ బీసీ విభాగం అధ్యక్షులు గద్దిబోయిన కృష్ణారావు, అల్లు లక్ష్మీనారాయణ, కింజరాపు రమేష్, బైరి మురళీ, హరి, జె.శ్రీనివాస్, చందు, శాంతారావు, చందు, వానపల్లి రమేష్, కన్నబాబు, శాంతారావు, భరద్వాజ్, సత్యనారాయణ, భాను ప్రసాద్, సీపాన మహేందర్, తోట తారక, పాపారావు, బగ్గు ఆసిరినాయుడు, కరగాన రాజారావు, హరి, స్థానిక పెద్దలు, పట్టణ వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేషనల్ స్విమ్మింగ్‌కు ధనుష్య ధరహాస్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళానికి చెందిన వేమకోటి ధనుష్య ధరహాస్ ఈ నెల 26, 27 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి మోడరన్ పెంటథలాన్ పోటీలో తేట్రాతలాన్ (స్విమ్మింగ్, షూటింగ్, ఫెన్సింగ్, రన్నింగ్) విభాగంలో 4వ స్థానం, రిలే (స్విమ్మింగ్, రన్నింగ్, షూటింగ్) విభాగంలో ప్రథమ స్థానం పొంది సెప్టెంబర్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈయన ఎంపికపై రాష్ట్ర స్విమ్మింగ్ స్టేట్‌ప్రెసిడెంట్ హారిక ప్రసాద్, సెక్రటరీ జాన్సీ, ఇంటర్నేషనల్ స్విమ్మర్ కాంతారావు, డిఎస్‌డిఓ శ్రీధర్, శ్రీకాకుళం, కోచ్ మురళీ, స్టేట్ సెక్రటరీ కృష్ణయ్య, శ్రీకాకుళం మోడరన్ పెంతలాన్ సెక్రటరీ చక్రధర్, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

# సామాజిక న్యాయానికి సాక్షీభూతుడు జగన్

- గోవిందరాజులు వ్యాఖ్యలు అర్థరహితం
- వైకాపా హయాంలోనే బీసీలకు పెద్దపీట

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కళింగ వైశ్య రాష్ట్ర అధ్యక్షునిగా ఉంటూ వైకాపా పట్ల బోయిన గోవిందరాజులు వ్యాఖ్యలు అర్థరహితమని, ఇదే సంఘంలో వైకాపా ప్రతినిధులుగా ఉన్న తమ మనోభావాలు తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని రాష్ట్ర వైకాపా కళింగవైశ్య బీసీ అనుబంధ సాధికార కమిటీ అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, జిల్లా వైకాపా కోశాధికారి తంగుడు నాగేశ్వరరావు, జిల్లా వైకాపా వాణిజ్య విభాగం అధ్యక్షులు కోరాడ చంద్రభూషణ్‌గుప్త, వైకాపా సీనియర్ నాయకులు తంగుడు జోగారావు ఖండించారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర నుంచి అశోక్ గజపతిరాజుకు గోవా గవర్నర్ పదవి రావడం, కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర విమానయాన మంత్రిని చేయడం, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సాధారణ కార్యకర్త కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేయడం పట్ల గోవిందరాజులు హర్షం వ్యక్తం చేయడంలో ఎటువంటి అభ్యంతరం లేదని, కానీ ఏ రాజకీయ పార్టీ ఇటువంటి అవకాశాలు కల్పించలేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 1999లో ఎన్డీయే ప్రభుత్వంతో సీట్లు సర్దుబాటు చేసుకొని మిత్రపక్షంగా ఉంటూ విజయం సాధించిన తర్వాత టీడీపీ కేంద్ర క్యాబినెట్‌లో చేరకపోవడానికి కారణాలను ఆ పార్టీ పెద్దలను అడిగి తెలుసుకొని సమాజానికి తెలియజేయాలని కోరారు. బీసీలను బ్యాక్ బోన్‌గా గుర్తించిన ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని గుర్తు చేశారు. వైకాపా ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి కళింగవైశ్యుల కోసం ఒక కుల కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి ఒక చైర్మన్, 10 కులకార్పొరేషన్ డైరక్టర్లను, నాలుగు బిజినెస్ కార్పొరేషన్ డైరక్టర్లను, బీసీ కళింగ వైశ్య మహిళకు శ్రీకాకుళం సుడా చైర్మన్ ఇచ్చి కళింగవైశ్యులను ఎంతగానో గౌరవించారని స్పష్టం చేశారు. ఈ 14 నెలల్లో పలాసలోని ఒక్క ఏఎంసీ పదవిని గతంలో ఉన్న మల్లా శ్రీనివాసరావుని తిరిగి నియమించిందే తప్ప, కళింగ వైశ్యులకు ఒక్క పదవి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. వారి అనుభవం, తెలివితేటలు అనేక సంవత్సరాలుగా టీడీపీలో ఉన్న కళింగవైశ్య టీడీపీ నాయకులకు పదవులు తెప్పించడంలో చూపించాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకుపోయిందన్నారు. పలాసలో రూ.200 కోట్లతో ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న ఉద్దానం ప్రజల కోసం ఆ ప్రాంతంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటించి హిరమండలం నుంచి ఉద్దానం వరకు రూ.800 కోట్లతో మంచినీటి అండర్ గ్రౌండ్ పైప్‌లైన్లను ఏర్పాటుచేసిన అపరభగీరథుడు జగన్మోహన్‌రెడ్డి అని తెలిపారు. వంశధార ప్రాజెక్టుకు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, అలాగే జగన్‌మోహనరెడ్డి హయాంలోనే నిధులు సమకూరాయన్న విషయం తెలుసుకొని మాట్లాడాలని స్పష్టం చేశారు. రూ.4వేల కోట్లతో మూలపేట పోర్టును 60 శాతం పూర్తి చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదేనని తెలిపారు.

## రోటరీ ఉచిత వైద్యసేవలు




(సత్యంన్యూస్, ఆమదాలవలస)

స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు రోటరీ ప్రతినిధులు ఉచిత వైద్యసేవలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ చాపర సుధాకర్, ప్రభుత్వ వైద్యులు పూజిత విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్టేట్ మెడికల్ కౌన్సిల్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ సుధాకర్‌ను రోటరీ సభ్యులు దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎస్.నరసింగరావు, అధ్యక్ష కార్యదర్శులు జేకే వెంకటేశ్వర్లు, పూర్వ అధ్యక్షులు టి.మదన్‌కుమార్, ఎస్.రవికుమార్, కె.సంజీవరావు, బాబులాల్, వి.జనార్దన్, బి.సూర్యారావు, చాపర విజయలక్ష్మి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువుల కష్టాలు తీర్చండి



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

రైతులు ఒక్క కట్ట యూరియా కోసం రోజూ గంటల తరబడి పనులు మానుకొని అధికారులు, రైతుభరోసా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని, గ్రామాలకు వస్తున్న ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయని, టీడీపీ నాయకులు ఎరువులను తమ ఇళ్ల వద్ద దాచుకొని బయట అమ్ముకుంటున్నారని, తక్షణమే కలెక్టర్ స్పందించి రైతుల కష్టాలు తీర్చాలని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. స్థానిక వైకాపా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో చింతాడ మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం ఇప్పటికే రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, ఇప్పుడు విత్తనాలు, ఎరువులు దొరకక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఇవేమి పట్టకుండా అక్కడ చంద్రబాబు, ఇక్కడ కూన రవికుమార్ విదేశాల్లో విహార యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో సాగుచేస్తున్న 53వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి 2,850 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే ప్రభుత్వం కేవలం 1600 మెట్రిక్ టన్నుల యూరియాను మాత్రమే సరఫరా చేసిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, వైకాపా నాయకులు సాకేటి శ్రీనివాసరావు, అన్నపు కృష్ణ, ధనుంజయరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అంతరాబలో ఆ కాలేజీ

# ఎక్కడుందబ్బా!

(మొదటిపేజీ తరువాయి)

లోగుట్టును పట్టుకోలేకపోయింది. హెడ్‌క్వార్టర్‌కు దూరంగా ఉండటం, మేనేజ్‌మెంట్ అందుబాటులో లేకపోవడంతో కాలేజీ యాజమాన్యం తరఫున అందిన కాగితాలనే ఆధారంగా చేసుకొని రెన్యూవల్ చేసేస్తున్నారు. యూనివర్సిటీ రికార్డుల్లో అంతా సవ్యంగా నడుస్తుందని ఉండటం వల్ల ఎన్‌సీటీఈ అధికారులే క్షేత్రస్థాయి పర్యవేక్షణకు వచ్చి క్లీన్‌చిట్ ఇచ్చి వెళ్లారు కాబట్టి తమ తప్పేమీ లేదని కప్పిపుచ్చుకోడానికి వర్సిటీ అధికారులు రేపట్నుంచి ప్రయత్నిస్తారు తప్ప, అసలు కాలేజీ ఉందా? లేదా? అనేది మాత్రం తేల్చరు. ఇంతకు మించిన దరిద్రమేమిటంటే.. శ్రీకాకుళం ఇందిరానగర్ కాలనీలో ఉన్న రవూఫ్ బీఈడీ కాలేజీని కూడా ఇదే శ్రీ శివసాయి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నడుపుతోంది.

## పర్యావరణంపై అవగాహన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్ మేర యువభారత్ శ్రీకాకుళం వారి సహకారంతో మంగళవారం చల్లవానిపేట విజ్ఞానదుర్గ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి కళాశాల కరస్పాండెంట్ గాలి మోహనరావు మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణం చాలా అందంగా తయారవుతుందన్నారు. నేల కోత నివారిస్తుందని, మొక్కలు నాటడం వలన వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ తగ్గుతుందని, దాని ఫలితంగా ఆక్సిజన్ స్వచ్ఛంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్.రంగారావు, అధ్యాపకులు జి.రమణారావు, మూలపేట వివేకానంద యువజన సేవా సంఘం అధ్యక్షులు జి.ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు.




## రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లను క్లియర్ చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చే సమయంలో రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లను క్లియర్ చేయాలని ఏపిపిటిడి (ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య కోరారు. ఈమేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసిలో ఇప్పటికే ఆరేళ్లుగా సుమారు 2వేల మంది పదోన్నతుల కోసం ఎదురుచూస్తూ రిటైర్ అయ్యారన్నారు. పదోన్నతులకు ప్రభుత్వం నుండి అనుమతులు రావడంలో జాప్యం జరుగుతున్నందున సుమారు 100 మంది అధికారులు కేవలం ఇన్‌చార్జ్ బాధ్యతలతో సరిపెట్టుకొని నెట్టుకొస్తున్నారన్నారు. క్రిందిస్థాయి కేటగిరి ఖాళీలు మాత్రం ఖాళీగా ఉండిపోయి సూపర్‌వైజర్లు/ఏడిసి/ క్లర్కు/ కంట్రోలర్లు లేక రాష్టంలోని అన్ని డిపో/యూనిట్లలో సుమారుగా 70 శాతం వరకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసి ఉద్యోగులకు సంబందించి సీఎం ఫేషీలో పదోన్నతుల కోసం వేచి ఉన్న పైల్‌కు వెంటనే అనుమతులు ఇచ్చేలా ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుండి అనుమతి తీసుకొని పదోన్నతులతో పాటు రిక్వెస్ట్ బదిలీలు ఇచ్చి అందరికి న్యాయం జరిగేలా చూడాలని సోమవారం ఆర్టీసి యం.డి.కి లేఖ ఇచ్చి విజ్ఞప్తి చేశామన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి




(సత్యంన్యూస్, టెక్కలి)

సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ టెక్కలి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం టెక్కలిలో గల సంక్షేమ వసతి గృహాన్ని, ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేయడం సమంజసం కాదన్నారు. అధికారుల పర్యవేక్షణ లేక వసతిగృహాల్లో అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. హాస్టల్లో ఉన్న సమస్యలపై ఫిర్యాదులు రావడంతో వసతి గృహాలను సందర్శించి వారి సమస్యలు తెలుసుకున్నామన్నారు. అనంతరం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను సందర్శించగా అక్కడ ఎటువంటి మౌలిక వసతులుగానీ మంచి భోజనం గానీ వాష్‌రూములు గాని సరిగ్గా లేవని విద్యార్థులు తమ వద్ద వాపోయారన్నారు. అలాగే అక్కడ వార్డెన్ కనీసం వారానికి ఒక్కరోజు కూడా విధులకు హాజరు కాకపోవటం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వాష్‌రూమ్స్‌లో నీటి సదుపాయం గానీ, విద్యుత్ సదుపాయం లేదన్నారు. సంబంధిత ఉన్నతశాఖ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర నాయకులు శ్యామ్, టెక్కలి కన్వీనర్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సంతబొమ్మాళి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినిలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.శివరంజని మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రతి సంవత్సరం తప్పనిసరిగా కంటిపరీక్షలు చేసుకోవాలని, దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కంటిఅద్దాలు సూచించినట్లయితే తప్పనిసరిగా ప్రతినిత్యం ధరించాలన్నారు. ముందస్తు కంటి పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దృష్టిలోపం ఉన్నట్లయితే ముందుగానే గుర్తించి సరిచేయడం వలన శాశ్వత అంధత్వానికి గురికాకుండా కంటిచూపును కాపాడవచ్చన్నారు. విద్యార్థులు ఆరోగ్యవంతమైన కంటిచూపు కోసం సరైన వెలుతురు, గాలి ఉన్నచోట చదువుకుంటూ సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి ఎంఆర్‌కె దాస్ మాట్లాడుతూ 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న 14 మందికి ఉచిత కళ్లద్దాల కొరకు సిఫారసు చేశామన్నారు. అక్టోబర్ 31 వరకు మండలంలో 6నుండి 18 సంవత్సరాలు ఉన్న ప్రతి విద్యార్థికి కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ యు లక్ష్మి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.




## కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




ప్రైవేట్ మరియు కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు తయారుఅవుతున్నాయని శ్రీకాకుళం జిల్లాలో సుమారు రూ.145 కోట్లతో 13 ఆస్పత్రులు సర్వాంగ సుందరంగా తయారుచేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ శ్రీకాకుళం జిల్లా కార్యనిర్వహక ఇంజినీర్ ఎం.సత్యప్రభాకర్ చెప్పారు. మంగళవారం శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు అన్నిరకాల మౌలిక సదుపాయాల కల్పన తమ శాఖ ప్రధాన లక్ష్యమన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో గల సర్వజన ఆస్పత్రి రూ.60కోట్లతో వివిధరకాల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. దీంతోపాటు రిమ్స్ మెడికల్ కాలేజీలో రూ.కోటి వ్యయంతో మరుగుదొడ్లు, మురుగునీరు, కాలువలు మరమ్మత్తులు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 12ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో 60 కోట్లతో ఐపీహెచ్ నిబంధనల మేరకు పనుల నాణ్యతలో ఎటువంటి అనుమానం లేకుండా పనులు జరుగుతున్నాయన్నారు. గర్భిణీలు, బాలింతలకు చిన్నపిల్లల వార్డుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సీతంపేట, పాలకొండ, కొత్తూరు, ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, టెక్కలి, నరసన్నపేట, రణస్థలం, ఆమదాలవలస, పొందూరు, బారువ తదితర ఆసుపత్రుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటివరకు 70శాతం పనులు పూర్తి అయ్యాయని.. మరో మూడు నెలల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు. ఎన్‌సీసీ సంస్థ పనులు చేస్తుందని, ఇందులో నాణ్యత నూటికి నూరుశాతం పాటించాలన్నారు.

## ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

(సత్యంన్యూస్, కొత్తూరు)

విద్యుత్ స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ ప్రజాసంఘాలు సంస్థలు ఇచ్చిన పిలుపుమేరకు వచ్చేనెల 5న విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయాలు వద్ద ధర్నాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం కొత్తూరు మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆద్వర్యంలో మాకొద్దు- స్మార్ట్ మీటర్ పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు ఈసందర్భంగా సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండి అని యువగళం పాదయాత్రలో లోకేష్ పిలుపు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. స్మార్ట్‌మీటర్లు ద్వారా ప్రజలను తీవ్రంగా దోపిడీ చేయడానికి పూనుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు తెలుగుదేశం కూటమి కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. సిఐటియు నాయకులు పల్ల క్రిష్ణ, పనస రమేష్, ఐలు నాయకులు, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల కాలనీ రోడ్ నిర్మాణం

(సత్యంన్యూస్, నరసన్నపేట)

నరసన్నపేట పంచాయతి జర్నలిస్ట్ కాలనీలో గ్రామ పంచాయితీ నిధులతో మంగళవారం సీసీ రోడ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఉప సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు ఇతరపెద్దలు పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొద్దు చిట్టిబాబు, నేతింటి విశ్వేశ్వరరావు, ఊన్న వెంకటేశ్వరరావు, బలివాడ చిట్టీపంతులు, పుచ్చల కల్పనాప్రసాద్, పీశ కృష్ణ, కింజరాపు చిన్నవాడు, బోయిన సతీష్, గోందు సత్యం, సదాశివుని క్రిష్ణ, కాంట్రాక్టర్ నేతింటి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.